


శంభో.. శివ శంభో!
నేడు మహా శివరాత్రి



మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలకు జిల్లాలోని శివాలయాలు సిద్ధమయ్యాయి. ఆర్కే బీచ్‌లో మహా కుంభాభిషేకానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. తీరంలో రాత్రంతా జాగరణ చేసి, వేకువజామున సముద్ర స్నానాలను ఆచరించిన భక్తులు, మనసారా శివుడ్ని దర్శించి తరించనున్నారు.

పరుగో... పరుగు



అనకాపల్లి జిల్లా పిసినికాడలో గురువారం 'చేయూత' నాలుగో విడత నిధులను బటన్ నొక్కి విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి



సీఎం మాట్లాడుతుండగా ప్రాంగణం నుంచి పరదాలు దాటుకుని బయటకు వచ్చేస్తున్న మహిళలు



బస్సులోనే ఉండిపోయిన మహిళలు

'వైఎస్ఆర్ చేయూత' పథకం నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమం గురువారం అనకాపల్లి మండలం పిసినికాడ గ్రామంలో నిర్వహించారు. సీఎం పాల్గొంటున్నందున సభకు రాకపోతే 'చేయూత' నిధులు అందవంటూ స్థానిక వైసీపీ నేతలు, వలంటీర్లు బెదిరించి మరీ లబ్ధిదారులను జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి బస్సులు, ఆటోల్లో పిసినికాడ తరలించారు. అయితే ముఖ్యమంత్రి మాట్లాడడం ప్రారంభించిన ఐదు నిమిషాలకే మహిళలు సభా ప్రాంగణం నుంచి వెనుతిరిగారు. కొందరు తమను తీసుకువచ్చిన బస్సుల్లోనే కూర్చున్నారు.

- వివరాలు మెయిన్ ఎడిషన్‌లో

జనసేనకు 4



కొణతాల రామకృష్ణ

అనకాపల్లి జిల్లాలో మూడు, విశాఖ జిల్లాలో ఒకటి..

- జాబితాలో అనకాపల్లి, ఎలమంచిలి, విశాఖ సౌత్, పెందుర్తి లేదా మాడుగుల
- ఒక స్థానానికి కొణతాల రామకృష్ణ పేరు ఇప్పటికే ప్రకటన
- మిగిలిన మూడుచోట్ల పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, వంశీకృష్ణ శ్రీనివాస్‌లకు అవకాశం?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశంతో పొత్తు నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేన పార్టీ పోటీ చేసే స్థానాలపై దాదాపు స్పష్టత వచ్చింది. ఇరు పార్టీల అధినేతల మధ్య తాజాగా జరిగిన చర్చల్లో జనసేనకు నాలుగు అసెంబ్లీ స్థానాలు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, ఎలమంచిలి, పెందుర్తి లేదా మాడుగుల, విశాఖ జిల్లాలో దక్షిణ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థులు పోటీ చేయనున్నారు.



పంచకర్ల రమేష్‌బాబు　వంశీకృష్ణ శ్రీనివాస్　సుందరపు విజయకుమార్

రెండు జిల్లాల్లో 13 అసెంబ్లీ స్థానాలు ఉండగా వాటిలో నాలుగుచోట్ల జనసేన అభ్యర్థులు బరిలో నిలవనున్నారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ఇప్పటికే కొణతాల రామకృష్ణను ప్రకటించిన విషయం తెలిసిందే. జనసేనలోకి వచ్చిన కొణతాల లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఉందని పలువురు భావించారు. అయితే ఊహించని విధంగా పవన్‌కళ్యాణ్ సోదరుడు నాగబాబు రంగంలోకి దిగారు. అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం మొత్తం తిరిగి, సమావేశాలు నిర్వహించారు. అచ్యుతాపురంలో ఉండడానికి నివాసం కూడా తీసుకున్నారు. ఆయన అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో పవన్‌కళ్యాణ్ విశాఖపట్నం పర్యటనకు రావడం, నేరుగా కొణతాల ఇంటికి వెళ్లి గంటన్నర సేపు మంతనాలు జరపడం చర్చనీయాంశంగా మారింది. అప్పుడే ఆయనకు అనకాపల్లి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఇస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. అదేవిధంగా ఎలమంచిలి నుంచి కూడా జనసేన పోటీ చేయనున్నది. అక్కడ సుందరపు విజయకుమార్ చాలాకాలంగా పార్టీకి పనిచేస్తున్నారు. ఆయనకే పోటీ చేసే అవకాశం లభించవచ్చునని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన సోదరుడు సతీశ్‌కుమార్ కూడా గత మూడు నెలలుగా పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ఆయనకు ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జి పదవి ఇచ్చారు. గాజువాక నుంచి పోటీకి దించుతారని ప్రచారం జరిగింది. అయితే పొత్తుల్లో భాగంగా గాజువాక సీటును తెలుగుదేశం పార్టీయే ఉంచుకుంటామని స్పష్టం చేసింది. ఇప్పుడు సతీశ్‌కుమార్ పార్టీ కోసమే పనిచేస్తారని అంటున్నారు.

పెందుర్తి లేదా మాడుగుల

అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు విస్తరించి ఉన్న పెందుర్తి సీటును కూడా జనసేనకు ఇవ్వడానికి టీడీపీ అధినేత అంగీకరించినట్టు చెబుతున్నారు. అయితే అక్కడ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి తనకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం ఆయన కుమారుడు అప్పలనాయుడు, అల్లుడైన శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు ప్రత్యేకంగా బుధవారం చంద్రబాబునాయుడును కలిశారు. జనసేనకు పెందుర్తికి ... మిగతా 6వ పేజీలో

అమర్‌కు టికెట్ లేనట్టే?

- పిసినికాడ సభలో పరోక్షంగా సంకేతాలు ఇచ్చిన సీఎం
- గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని ప్రకటన
- 2019 ఎన్నికల సమయంలో దాడి రత్నాకర్‌కూ అదే హామీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి ఎమ్మెల్యే, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఈసారి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించేటట్టు లేదు. ఈ విషయంపై గురువారం అనకాపల్లి మండలం పిసినికాడలో నిర్వహించిన 'చేయూత' సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డే స్పష్టత ఇచ్చారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మంత్రి గుడివాడ అమర్ ఇద్దరూ తనకు తమ్ముళ్లలాంటి వారని, భరత్‌ను ఎమ్మెల్యేగా పోటీకి దింపుతున్నామని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. మంత్రి అమర్‌ను గుండెల్లో పెట్టుకుంటానని చెప్పుకొచ్చారు. అంటే ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదనే విషయాన్ని పరోక్షంగా స్పష్టంచేశారు.

దాడి వీరభద్రరావు తన తనయుడు రత్నాకర్‌తో కలిసి 2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. అప్పుడు కూడా జగన్ ఇదే మాట అన్నారు. రత్నాకర్ తన సోదరుడితో సమానమని, గుండెల్లో పెట్టుకుంటానని చెప్పారు. అయితే ఆ ఎన్నికల్లో ఆయనకు ఎక్కడా పోటీ చేసే అవకాశం కల్పించలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీనియర్ నాయకుడైన వీరభద్రరావుకు గానీ, కుమారుడు రత్నాకర్‌కు గానీ ఎటువంటి పదవి ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో కూడా రత్నాకర్ పేరును పరిగణనలోకి తీసుకోకుండా భరత్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. దాంతో వీరభద్రరావు, ... మిగతా 6వ పేజీలో

'ప్రసాద్', 'స్వదేశీ దర్శన్' పనులకు పీఎం శంకుస్థాపన



మోదీ శంకుస్థాపన తరువాత ప్రముఖుల కరతాళధ్వనులు

- కశ్మీర్ నుంచి వర్చువల్‌గా ప్రారంభం
- రూ.54.5 కోట్లతో సింహాచలం దేవస్థానం అభివృద్ధి
- బొర్రా గుహల్లో సదుపాయాల కల్పనకు రూ.30 కోట్లు

సింహాచలం, మార్చి 7: 'ప్రసాద్' పథకం కింద రూ.54.4 కోట్లతో తలపెట్టిన సింహాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు, 'స్వదేశీ దర్శన్ 2.0' కింద అల్లూరి సీతారామరాజు జిల్లా బొర్రాగుహల్లో రూ.20 కోట్లతో చేపట్టనున్న నిర్మాణాల (పర్యాటకులకు అదనపు సదుపాయాలు)కు జమ్మూ కశ్మీర్ నుంచి ప్రధాని నరేంద్రమోదీ గురువారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దేశవ్యాప్తంగా పలు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి 'ప్రసాద్' పథకం కింద కేంద్రం నిధులు కేటాయించింది. అందులో భాగంగా సింహగిరిపై రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పలు నిర్మాణాలు చేపట్టనున్నది. ఈ సందర్భంగా సింహగిరిపై ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు భాగస్వాములయ్యారు. సింహాచలం క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు 'ప్రసాద్' పథకం నిధులు మంజూరుచేసినందుకు ప్రధానికి రాష్ట్ర పర్యాటక శాఖ మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. పర్యాటక శాఖ ఇంజనీరింగ్ విభాగం సీఈ సీఎస్ఎస్ మూర్తి 'ప్రసాద్, స్వదేశీ దర్శన్' కింద సింహగిరి, బొర్రా గుహల్లో చేపట్టనున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు మాధవ్, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, అల్లూరి జిల్లా జేసీ భావన వశిష్ఠ, సింహాచలం దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి, టూరిజం శాఖ ఈఈ రమణ, భీమిలి ఆర్డీఓ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్టీల్‌ప్లాంటులో బయోమెట్రిక్

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు యాజమాన్యం గురువారం నుంచి ఉద్యోగులు, కార్మికుల హాజరును పూర్తిగా బయోమెట్రిక్ ద్వారా తీసుకోవడానికి ఏర్పాట్లుచేసింది. దీనికి అధికార వర్గాలు అంగీకరించినా, కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇక్కడ రోజుకు 8 గంటలు పని చేయాల్సి ఉన్నా...ఆది నుంచి కొన్ని దశాబ్దాలుగా ఇంకో అరగంట అదనంగా పనిచేస్తున్నారు. దానికి సంబంధించి ఎటువంటి అదనపు మొత్తాలు ఇవ్వడం లేదు. అయితే కొంతమంది రికార్డులో సంతకం చేసి బయటకు వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్లాంటులో లోపాలన్నీ సవరించి, సక్రమంగా నడపాలనే ధ్యేయంతో యాజమాన్యం బయోమెట్రిక్ హాజరుకు పట్టుబడుతోంది. ఇందుకోసం 600 అటెండెన్స్ పరికరాలను కూడా సిద్ధం చేసింది. ప్లాంటులో అధికారులు, కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు మొత్తం 29 వేల మంది ఉన్నారు. అధికారులు బయోమెట్రిక్‌కు ఒప్పుకున్నా కార్మికులు అంగీకరించడం లేదు. తమకు వేతన సవరణతో పాటు దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించిన తరువాతే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే అంశంపై ఇటీవల పర్సనల్ డైరెక్టర్ చాంబర్‌లో ఆందోళనకు దిగారు. సీఎండీని కూడా ఘెరావ్ చేశారు. అయినా యాజమాన్యం వెనక్కి తగ్గలేదు. శుక్రవారం నుంచి అమలు చేయడానికి రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో కార్మికులు కూడా ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ఆస్తి పన్ను బకాయిలపై గ్రేటర్ దృష్టి

మొండి బకాయిలు రూ.64 కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ రూ.18 కోట్లు వసూలు

- నెలాఖరులోగా మిగిలిన రూ.46 కోట్ల వసూలుకు యత్నం
- టాప్ 100 అసెస్‌మెంట్ల గుర్తింపు
- అవకాశం ఉన్న వాటి విషయంలో దూకుడుగా వెళ్లాలని అధికారుల నిర్ణయం
- చట్టప్రకారం వివాదాలను పరిష్కరించుకుని బకాయి రాబట్టాలని నిర్ణయం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)కు ఆస్తి పన్ను బకాయిలు ఏటేటా పెరిగిపోతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో రూ.64 కోట్లు ఉండగా, ఇప్పటివరకూ రూ.18 కోట్లు వసూలుచేశారు. మిగిలిన రూ.46.65 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అందులో వీలైనంత మేర ఈ నెలాఖరులోగా రాబట్టేందుకు రెవెన్యూ విభాగం అధికారులు కసరత్తు ప్రారంభించారు. పన్ను బకాయిలకు సంబంధించి కొంతమంది కోర్టులను ఆశ్రయించారు. అలాంటి అసెస్‌మెంట్ల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తూనే వివాదం లేని అసెస్‌మెంట్ల నుంచి బకాయిల వసూలు విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు.

జీవీఎంసీ పరిధిలో 5,72,356 ఆస్తి పన్ను అసెస్‌మెంట్లు (ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను) ఉన్నాయి. వీటి ద్వారా ఆస్తి పన్ను రూపంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.306 కోట్లు వసూలు కావాల్సి ఉండగా...ఇప్పటివరకూ రూ.222.72 కోట్లు వసూలైంది. ఇంకా దాదాపు రూ.84 కోట్లు రావాల్సి ఉంది. ఆస్తి పన్ను చెల్లింపుపై వడ్డీ మాఫీ ప్రకటించడంతో ఈ నెలాఖరు నాటికి ఆ మొత్తం వసూలైపోతుందని రెవెన్యూ విభాగం అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. అయితే ఇవికాకుండా...మొండి బకాయిలు రూ.64 కోట్లు ఉన్నాయి. దాదాపు వంద అసెస్‌మెంట్ల నుంచి ఈ మొత్తం రావలసి ఉందని అధికారులు చెబుతున్నారు. వీటిలో అత్యధికంగా ఇన్ఫోటెక్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ రూ.6,13,90,874, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్ ప్రైవేటు లిమిటెడ్ రూ.2,82,98,744, ది డైరెక్టర్ అండ్ డీఆర్‌డీఓ అండ్ ఎన్ఎస్‌టీఎల్ రూ.1,35,63,191, సింబియోసిస్ రూ.1,21,42,989, ఎస్‌డీఎస్ఎస్‌టీజేపీ ఆర్‌సీఎం యూపీ స్కూల్ రూ.1,21,04,061, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూ.1,16,57,918, సంధ్య ... మిగతా 6వ పేజీలో

అత్యధిక బకాయిలు ఉన్న పది సంస్థలు

వ.నం	సంస్థ పేరు	బకాయి మొత్తం
1.	ఇన్‌ఫోటిక్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్	రూ.6,13,90,874
2.	మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్	రూ.2,82,98,744
3.	ది డైరెక్టర్ అండ్ డీఆర్‌డీఓ అండ్ ఎన్ఎస్‌టీఎల్	రూ.1,35,63,191
4.	సింబియోసిస్ టెక్నాలజీస్	రూ.1,21,42,989
5.	ఎస్‌డీఎస్ఎస్‌టీజేపీ ఆర్‌సీఎం యూపీ స్కూల్	రూ.1,21,04,061
6.	ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా	రూ.1,16,57,918
7.	సంధ్య రియల్టర్స్ ప్రైవేటు లిమిటెడ్	రూ.1,15,40,104
8.	ఈస్ట్‌కోస్ట్ గ్యాస్ కంపెనీ	రూ.89,98,582
9.	వైజాగ్ ఐటీ పార్క్ లిమిటెడ్	రూ.89,47,196
10.	మహతి సాఫ్ట్‌వేర్ ప్రైవేటు లిమిటెడ్	రూ.89,32,979



స్టాండింగ్ కమిటీ సమావేశంలో కూర్చున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

సభ్యులు గైర్హాజరు

- కోరం లేక జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు వాయిదా
- సీఎం సభకు వెళ్లిన చైర్‌పర్సన్, సభ్యులు

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లా పర్యటన నేపథ్యంలో గురువారం నిర్వహించాల్సిన జిల్లా ప్రజా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలకు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో సహా సభ్యులు ఎవరూ హాజరుకాలేదు. దీంతో కోరం లేనందున సమావేశాలను వాయిదా వేశామని, తదుపరి ఎప్పుడు నిర్వహించేదీ తెలియజేస్తామని డిప్యూటీ సీఈవో సత్యనారాయణ తెలిపారు. సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించడంతో వచ్చిన అధికారులంతా హాజరు పుస్తకంలో సంతకం చేసి వెళ్లిపోయారు. సీఎం అనకాపల్లి జిల్లా పర్యటనకు వస్తున్న విషయం వారం రోజుల ముందే తెలుసు. ఆ సభకు అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున...స్టాండింగ్ కమిటీ సమావేశాలను ముందుగానే వాయిదా వేసుకోవాల్సింది. కానీ జడ్పీ అధికారులు అవేవి పట్టించుకోకుండా యథావిధిగా జడ్పీ హాలులో స్టాండింగ్ కమిటీ సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేసేశారు. చివరకు ఒక్క సభ్యుడు కూడా రాకపోవడంతో కోరం లేదంటూ వాయిదా వేశారు. జడ్పీ అధికారుల తీరుపై పలువురు అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

కేజీబీవీల్లో కలెక్షన్ కలకలం

- మినిమం టైమ్ స్కేల్ పరిధిలోకి తీసుకువచ్చేలా ఉత్తర్వులు ఇప్పిస్తామంటూ టీచర్ల నుంచి డబ్బుల వసూళ్లకు సంఘ నేత యత్నం

- వార్త II పేజీలో

ఎన్నికలు నేపథ్యంలో కేంద్ర బలగాల కవాతు



కేంద్ర బలగాల కవాతు

విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల నిర్వహణ నిమిత్తం నగరానికి వచ్చిన కేంద్ర సాయుధ బలగాలు గురువారం పలుప్రాంతాల్లో కవాతు నిర్వహించాయి. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూసేందుకు కేంద్ర రిజర్వు బలగాలు నగరానికి చేరుకున్నాయి. ఆయా బలగాలకు నగరంపై అవగాహన కలగడంతోపాటు ఓటు హక్కు వినియోగం సమయంలో భద్రతకు ఇబ్బంది లేదనే భరోసా నగర వాసుల్లో నింపేందుకు వీలుగా మార్చ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ రవిశంకర్‌అయ్యన్నార్ ఆదేశించారు. ఈ మేరకు హార్బర్ సబ్‌డివిజన్ పరిధిలోని వన్‌టౌన్, మల్కాపురం స్టేషన్ల పరిధిలో గురువారం మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్‌స్టేషన్ సీఐతోపాటు ఎస్ఐలు పాల్గొనివారికి మార్గనిర్దేశం చేశారు.

దేవతా మూర్తులకు ప్రతి రూపమే మహిళలు

» క్రైమ్ డీసీపీ వెంకటరత్నం

డాబాగార్డెన్స్, మార్చి 7: ప్రతి స్త్రీ ఐదు దేవతా మూర్తుల శక్తిని కలిగి ఉంటుందని, దానిని వెలికితీసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని క్రైమ్ డీసీపీ వెంకటరత్నం పిలుపునిచ్చారు. గురువారం పాతజైల్‌రోడ్డులోని పైడా వుమెన్స్ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మితో కలిసి జ్యోతి ప్రజల్వన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో స్త్రీ పాత్ర కీలకమన్నారు. ప్రేమ, ఆత్మస్థైరం, కుటుంబ నిర్వహణ, ఉన్నతి, అనుగారంలో పార్వతీదేవి, శక్తి, కాళీ, దుర్గ, సరస్వతీగా వ్యవహరిస్తుందన్నారు. విద్యార్థినులందరిలో ఆ శక్తులు దాగి ఉంటాయని, వాటిని వెలికి తీసి తమ ఉన్నతికి కృషి చేయాలన్నారు. పైడా కళాశాలల అధినేత పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 50 ఏళ్ల కిందట 80 మంది విదార్థులు చదువుకుంటే అందులో 78 మంది పురుషులు, కేవలం ఇద్దరు స్త్రీలు ఉండేవారన్నారు. అప్పట్లో మహిళలంతా ఇంటికే పరిమితమయ్యావారన్నారు. అంబేడ్కర్ లా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ స్త్రీ జన్మ ఎంతో గొప్పదన్నారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నతశిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.సరోజ్ అధ్యక్షత వహించగా, మిసెస్ ఆంధ్ర 2024 విజేత శిరిష, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్త్రీ గొప్పతనాన్ని వివరిస్తూ విద్యార్థినుల నృత్యాలు అలరించాయి.


డీసీపీ వెంకటరత్నం, లా ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, మిసెస్ ఆంధ్ర విజేత శిరిషను సత్కరిస్తున్న అతిథులు

మహిళా పోలీసులకు సత్కారం

మాధవధార: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మురళీనగర్ వనితా వాకర్స్‌క్లబ్‌లో గురువారం వేడుకలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన 50వవార్డు టీడీపీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు మహిళా దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విభిన్న రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలను సత్కరించారు. వీరిలో వన్‌టౌన్ మహిళా ఎస్.ఐ త్రినేత్రి, గోపాలపట్నం క్రైమ్ ఏఎస్ఐ గోవిందమ్మ, త్రీటౌన్ ఉమెన్ కానిస్టేబుల్ ఎస్. జలఉష, ద్వారకా ఏఎస్ఐ సీతామహాలక్ష్మి ఉన్నారు. వీరితో పాటు వ్యాపారం, కళల్లో ప్రతిభ చూపిన వారినీ సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు.

మహిళా ఉద్యోగుల కృషి అభినందనీయం

విశాఖపట్నం: వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం రైల్వే క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్, మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ పాల్గొని రైల్వే శాఖ అభివృద్ధిలో మహిళా ఉద్యోగుల సేవలను కొనియాడారు. అనంతరం లోకో పైలెట్, ట్రైన్ మేనేజర్, ట్రాక్ మెయింటెయినర్లతోపాటు లోకోషెడ్, సిగ్నల్ టెలికాం, హెల్త్ యూనిట్స్, ఆర్పీఎఫ్ శాఖలో పనిచేస్తున్న 45 మంది మహిళా ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం కార్యదర్శి మధుమితా సాహు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అంకిత శర్మ, తదితరులు పాల్గొన్నారు.


మహిళా పోలీసులను సత్కరిస్తున్న నిర్వాహకులు

మహిళలకు చీరలు పంపిణీ

పూర్ణామార్కెట్: మహిళా దినోత్సవం సందర్భంగా వారి కళ్లలో సంతోషం చూసేందుకు దర్గాలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా చీరలు పంపిణీ చేసినట్టు బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ వెల్లడించారు. పూర్ణామార్కెట్, వెలంపేట, పెరికివీధి ప్రాంతాల్లో గురువారం మహిళలకు చీరలు పంపిణీ చేసి, మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఘన సత్కారం

సీతమ్మధార: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం పౌర గ్రంథాలయంలో పోలీస్ శాఖలో విశేష సేవలందించిన నగర క్రైం బ్రాంచ్ డిప్యూటీ కమిషనర్ పి.వెంకటరత్నంను యాక్మీ ఈవెంట్స్, నవరత్నాలు సంస్థ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఆమెతో పాటు వివిధ రంగాల్లో సేవలందించిన వారిని సత్కరించారు. ఎస్.రహమతుల్లా, రతన్ రాజు, శిజు భవకదన్, కొణతాల రాజు, ఆడారి కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలు విద్యలో రాణించాలి

సీతంపేట: మహిళలు విద్యలో రాణించాలని, జీఎస్టీ అధికారిణి డాక్టర్ జీన్ జేసుదాస్ పేర్కొన్నారు. పౌర గ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ బాలికలు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను ఆధిరోహించాలన్నారు. సీనియర్ స్టేజ్ నటీ దూసి అనురాధను సత్కరించారు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బి.చిన్నారావు, ఉషారాణి, ఆచార్య ఎస్‌పీడీ పాల్, వర్రే నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.


సత్కారం అందుకున్న రైల్వే మహిళా సిబ్బందితో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర అధికారులు

జనసేనకు 4

... 5వ పేజీ తరువాయి

బదులుగా మాడుగుల కేటాయించాలని సూచించారు. దీనిపై ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. పెందుర్తి ఒకవేళ జనసేనకు ఇస్తే ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు పోటీ చేసే అవకాశం ఉంది. పంచకర్ల వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరినప్పుడు పెందుర్తి నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని అధినేతను కోరగా..ఆయన భరోసా ఇచ్చారని, దీంతో పొత్తుల్లో పెందుర్తి సీటును కోరారని పార్టీ నాయకులు చెబుతున్నారు.

'దక్షిణం'లో ఆశావహులు అనేకం

విశాఖ జిల్లాకు వచ్చేసరికి ఏడు అసెంబ్లీ స్థానాలు (ఆరు పూర్తిగా, ఒకటి పాక్షికంగా) ఉండగా...మొదట మూడు (గాజువాక, భీమిలి, విశాఖ దక్షిణం) సీట్లు ఇవ్వాలని జనసేన ప్రతిపాదించింది. అయితే అందుకు టీడీపీ అధిష్ఠానం ఒప్పుకోలేదు. దక్షిణ నియోజకవర్గం సీటు ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ సీటు కోసం జనసేనలో అనేక మంది పోటీ పడుతున్నారు. అయితే వైసీపీ ఎమ్మెల్సీగా ఉంటూ ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్‌కు అవకాశం లభించవచ్చునని ప్రచారం జరుగుతోంది. గత కొంతకాలంగా దక్షిణంలో టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీకి వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఇస్తారని అంచనా వేస్తున్నారు.

అమర్‌కు టికెట్ లేనట్టే?

... 5వ పేజీ తరువాయి

రత్నాకర్‌లు కొద్దికాలం క్రితం వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. జగన్ 'గుండెల్లో పెట్టుకుంటాను' అంటే దాని అర్థం ఇలాగే ఉంటుందని ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు అంటున్నారు. వాస్తవానికి అమర్‌నాథ్ మంత్రి అయిన తొలిరోజుల్లో మీడియా ముందు చేసిన 'కోడిగుడ్డు' వ్యాఖ్యలతో పార్టీకి చెడ్డపేరు వచ్చింది. కేవలం జనసేన అధినేతను దూషించడమే పనిగా పెట్టుకోవడంతో సొంత సామాజికవర్గం కూడా ఆయనకు కలిసి రాలేదు. ఈ నేపథ్యంలోనే ఆయన్ను ఈసారికి పక్కన పెట్టేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సైనికుడిలా పనిచేస్తా: మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ఇదే సభలో పాల్గొన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో తనకు పోటీ చేసే అవకాశం లేకపోయినా సరే సైనికుడిలా జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి పనిచేస్తానని ప్రకటించారు.

ఆస్తి పన్ను బకాయిలపై గ్రేటర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

రియల్టర్స్ ప్రైవేటు లిమిటెడ్ రూ.1,15,40,104, ఈస్ట్‌కోస్ట్ గ్యాస్ కంపెనీ రూ.89,98,582, వైజాగ్ ఐటీ పార్క్ లిమిటెడ్ రూ.89,47,196, మహతి సాఫ్ట్‌వేర్ ప్రైవేటు లిమిటెడ్ రూ.89,32,979 చెల్లించాల్సి ఉంది. వీటితో మిగిలిన అసెస్‌మెంట్ల యజమానుల నుంచి బకాయిలు రాబట్టేందుకు రెవెన్యూ అధికారులు పలువిధాలుగా యత్నిస్తున్నారు. అయితే కోర్టులో కేసులు వేయడం అడ్డంకిగా మారింది. అయినప్పటికీ ఇంతవరకూ రూ.18 కోట్లు వరకూ వసూలు చేయగలిగారు. మిగిలిన వి వసూలకు న్యాయపరంగా చేపట్టాల్సిన ప్రక్రియను పూర్తిచేస్తూనే... యజమానులను కలిసి వివాద పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు.

తూనికలు, కొలతల శాఖ దాడులు


వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అక్కయ్యపాలెం, మార్చి 7: విశాఖపట్నం హోల్‌సేల్ కూరగాయలు, ఫ్రూట్స్ మార్కెట్లలో తూనికలు, కొలతల శాఖాధికారులు గురువారం దాడులు నిర్వహించారు. వ్యాపారులు వినియోగిస్తున్న కాటాలకు ముద్రలు లేకపోవడంతో మొత్తం 14 కేసులు నమోదు చేశారు. మార్కెట్‌లో తూనికలు, కొలతలపై ధర్మ కాటా ఏర్పాటు చేసి వినియోగదారులకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ కంట్రోలర్ కేటీ రవికుమార్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అసిస్టెంట్ కంట్రోలర్ పీడీపీ అప్పలరాజు, గాజువాక అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్ఎం రాధాకృష్ణ, సిటీ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పీసీబీ ఈఈగా ముకుందరావు



విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీరు(ఈఈ)గా పీవీ. ముకుందరావును నియమించారు. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ఏఈగా పనిచేస్తున్న ఆయనకు తాజాగా పదోన్నతి లభిం చింది. కాలుష్య నియంత్రణ మండలిలో 2007లో ఏఈగా నియ మితులయ్యారు. ఇప్పటివరకు విశాఖలో ఈఈగా పనిచేసిన నాగిరెడ్డి పదోన్నతిపై జోనల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఎస్ఈ పోస్టులో నియమితులయ్యారు.

ఘనంగా నీలమ్మ అమ్మవారి తొలేళ్లు

అల్లిపురం, మార్చి 7: స్థానిక శ్రీనీలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం తొలేళ్ల ఉత్సవంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, ఉదకాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. అనంతరం తిరువీధుల్లో మహిళా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించి తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో భక్తులు అగ్నిగుండం మహోత్సవం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, ఆలయ ఈవో రమాబాయి. బొర్రాశ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.


నీలమ్మ అమ్మవారికి పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు

నేటి నుంచి శివ జయంతి ఉత్సవాలు

డాబాగార్డెన్స్: నవనిర్మాణం చేసే శక్తి ఆధ్యాత్మికతకు మాత్రమే ఉందని వక్తలు పేర్కొన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో 88వ త్రిమూర్తి శివ జయంతి వివరాలను బ్రహ్మకుమారీస్ ప్రతినిధి టీకే కామేశ్వరి తెలిపారు. ఈ నెల 8,9,10 తేదీల్లో ఎండాడలో సహస్ర శివలింగ దర్శనం, అభిషేక లింగం, పుష్పలింగం, మంచులింగ దర్శనం ఉంటుందన్నారు. శారదాపీఠాధిపతి ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ జాయింట్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు బ్యానర్‌ను ఆవిష్కరించారు.

శివపూజలకు సర్వం సిద్ధం

కంచరపాలెం: శివరాత్రి పర్వదినం సందర్భంగా కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో శైవాలయాలు ముస్తాబయ్యాయి. తిక్కవానిపాలెం, రెడ్డికంచరపాలెం, గంగన్ననగర్, గొల్లకంచరపాలెం, మెట్టు, తుమ్మడిపాలెం తదితర ఆలయాలను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయాల్లో శుక్రవారం తెల్లవారుజామునుంచి జరగనున్న ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

శివరాత్రి వేడుకలకు ఆహ్వానం

మురళీనగర్: స్థానిక బ్రహ్మకుమారీస్ శాంతి ధామంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్టు నిర్వాహకురాలు టీకే అపరంజి తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి కాశీ విశ్వనాథుని దర్శనం, స్వయంగా అభిషేకం చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా శివ అవతరణ తెలిపే చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మాధవధార, మురళీనగర్ ఆలయాల్లో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

గణపతి ఆలయంలో అన్నదానం

జ్ఞానాపురం: కాన్వెంట్ కూడలి జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్ వద్ద గల శ్రీసౌభాగ్య గణపతి ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మోపిదేవి శంకరరావు, రామకృష్ణ ఆర్థిక సహాయంతో సమారు 3వేల మందికి అన్నదానం చేశారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలకంరణలు చేశారు. కార్యక్రమంలో హోల్‌సేల్ మార్కెట్ సభ్యులు కె.వీర్రాజు, విల్లూరి పరమేశ్, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'వెలమల రాజకీయ హక్కుల పరిరక్షణే ధ్యేయం'

డాబాగార్డెన్స్, మార్చి 7: వెలమల రాజకీయ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పరిరక్షణ వేదిక కృషి చేస్తుందని కన్వీనర్ రెడ్డి దామోదరరావు అన్నారు. గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గానికి ఐదు పార్లమెంట్, 24 అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 35 లక్షల వెలమలున్నారని, టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులను కలిసి వినతి పత్రాలు ఇచ్చామన్నారు.


సంఘీభావం ప్రకటిస్తున్న వెలమ సంక్షేమ సంఘం సభ్యులు

తగిన ప్రాధాన్యమివ్వాలి

సిరిపురం : వచ్చే ఎన్నికల్లో వెలమలకు తగిన ప్రాధాన్యమివ్వాలని వెలమ రాజకీయ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రెడ్డి దామోదరరావు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో వెలమ కులస్తుల హక్కులపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తగిన ప్రాధాన్యత ఇవ్వని పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు. సమావేశంలో సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్కా చినబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, చలుమూరు అప్పల సత్యనారాయణ, రొంగలి జగన్నాథం, ముర్రి ముత్యాలనాయుడు, ఈర్ల శ్రీరామ్మూర్తి, సిరిపురపు కృష్ణమోహన్, పైలా ముత్యాలనాయుడు, బండారు రామకృష్ణ, రాజాన వెంకటరావు, గొర్లు వెంకునాయుడు, పైలా మారడయ్య, జాగారపు బుచ్చు, రంభ నారాయణమూర్తి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరం

» టెక్నికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర సెక్రటరీ రమణబాబు

కంచరపాలెం, మార్చి 7: పరిశ్రమల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరమని రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ కె.వి.రమణబాబు పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన 'పరిశ్రమలు-భద్రత'పై అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు భద్రతా నియమాలు పాటించాన్నారు. విధులు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ జీఎం (సేఫ్టీ) దువ్వాడ రామ్‌ప్రసాద్ భద్రతపై పలు అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన సదస్సులో సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ ఎ.వరహాలు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రమణబాబు

సచివాలయంలో ప్రజా ప్రతినిధుల చిందులు

» జత కలిసిన ఉద్యోగులు, వలంటీర్లు
» సినిమా పాటలకు డ్యాన్సులు చేస్తూ హడావిడి
» సామాజిక మాధ్యమాల్లో వైరల్
» ధారకొండలో ఘటన
» మండిపడుతున్న గ్రామస్థులు

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా), మార్చి 7: పౌర సేవలు అందించాల్సిన సచివాలయంలో ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, వలంటీర్లు చిందులు వేశారు. సినిమా పాటలకు డ్యాన్సులు చేస్తూ హడావిడి చేశారు. దీనిని వీడియో తీసి వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోవడంతో గురువారం ఇది సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం ధారకొండలో కొత్తగా నిర్మించిన సచివాలయం భవనాన్ని బుధవారం ఉదయం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అట్టహాసంగా ప్రారంభించారు.


ధారకొండ సచివాలయంలో డ్యాన్సులు చేస్తున్న ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు

కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే వెళ్లిపోయిన తరువాత వైసీపీకి చెందిన గ్రామ సర్పంచ్ నడిగట్ల రాజు, ఆయన అనుచరులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సచివాలయంలోకి వెళ్లి సినిమా పాటలు పెట్టుకుని డ్యాన్సులు చేశారు. ఆ సమయంలో బయట వారిని ఎవరినీ లోపలకు అనుమతించలేదు. వీరిలో ఒకరు ఈ డ్యాన్సులను వీడియో తీసి గురువారం వాట్సాప్ స్టేటస్ పెట్టడంతో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. సచివాలయంలో ఇటువంటి చేష్టలు ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై కలెక్టర్, ఐటీడీఏ పీవోకు స్థానికులు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.



ప్రచారంలో పాల్గొన్న గణబాబు, శ్రీభరత్

వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలి

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, మార్చి 7: వైసీపీ పాలన అంత అవినీతిమయమని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని 'పశ్చిమ' ఎమ్మెల్యే పీగణబాబు పేర్కొన్నారు. 60వ వార్డులో టీడీపీ-జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ విశాఖ పార్లమెంట్ నేత ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్‌కు ఒక అవకాశం ఇచ్చి ప్రజలంతా దగాకు గురయ్యారన్నారు. అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. గణబాబు, శ్రీభరత్‌లకు స్థానిక మహిళలు మంగళ హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీడీపీ, జనసేన నాయకులు మాతా శ్రీను, అంగ దుర్గాప్రశాంతి, నాయకలు వినయ్, త్రినాథ్, కుమార్‌రాజా, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

'బీసీ డిక్లరేషన్‌తో ఎంతో మేలు'

గాజువాక , మార్చి 7: బీసీ డిక్లరేషన్ వల్ల వారికి ఎంతో మేలు చేకూరుతుందని, టీడీపీ-జనసేన ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో వైసీపీ నాయకుల మైండ్ బ్లాక్ అయిం తెలుగుదేశం పార్టీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లకే బీసీలకు పింఛన్, చంద్రన్న బీమా పథకం పెంపు వంటి అంశాలు అందరికీ ఉపయుక్తంగా ఉంటాయన్నారు. సమావేశంలో నాయకులు బొడ్డు వెంకటరమణ, పప్పు శంకరరావు, టి.శివప్రసాద్, వి.కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన జాతీయ పరిశోధన శిక్షణ సంస్థ ప్రతినిధులు

గోపాలపట్నం, మార్చి 7: స్థానిక ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలను జాతీయ పరిశోధన శిక్షణ సంస్థ ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా వారు పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. తరగుతుల నిర్వహణ, బోధనలో అనుసరిస్తున్న మెలకువలు, తదితర అంశాల గురించి అడిగి తెలుసుకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ చౌహాన్, డాక్టర్ నాగేంద్రయాదవ్, ప్రొఫెసర్ వినోద్‌శర్మ, రవి ప్రతాప్‌సింగ్, డైట్ లెక్చరర్ జె.మాధవి, మోనటరింగ్ అధికారిణి లక్ష్మి, ఎంఈవో దివాకర్, హెచ్‌ఎం సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ కో-ఆర్డినేటర్‌గా కొవిరి దేముడు

పెదగంట్యాడ, మార్చి 7: రాష్ట్ర ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ కో-ఆర్డినేటర్‌గా కొవిరి దేముడు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ కదిరి జగన్నాథం నియామక ఉత్తర్వులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామమూర్తి, జగన్నాథంలకు దేముడు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షునిగా కొవిరి కోదండరావు నియమితులయ్యారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 16, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజీ 22, క్యారెట్ 24, దొండకాయలు 24, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 55, బరబాటి 15, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 28, కంద 60, దేముడుచిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	105
ఫారం ధర	--	125
విత్ స్కిన్	--	220
స్కిన్‌లెస్	--	230

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



పెందుర్తి మండలం పినగాడిలోని చోడేశ్వరాలయం



విద్యుద్దీప కాంతుల్లో స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు శివాలయం



86వ వార్డు మాతృశ్రీనగర్‌లోని ఉమామహేశ్వరాలయం

శివ పూజకు వేళాయె..

మహా శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసిన ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు

పెందుర్తి, మార్చి 7: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లోని శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పండుగను పురస్కరించుకుని శుక్రవారం వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు శివాలయాలకు తరలిరానున్నందున ఆయా ఆలయ కమిటీల ప్రతినిధులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని సరిపల్లిలో ఉన్న స్వయంభు శివాలయం, పాత పెందుర్తి, ప్రశాంతినగర్‌లోని శైవక్షేత్రాలు, పినగాడిలోని చోడేశ్వ రాలయం, సుజాతనగర్‌లోని హరిహర క్షేత్రం, రత్నగిరినగర్‌లో గల విశాలక్షి విశ్వేశ్వరాలయం, చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని ఆలయం, వుడాకాలనీ, శ్రమశక్తినగర్‌లోని శివాలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో రానున్నందున వారు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లు చేశారు.



జాగరణతో మోక్షం

-ముక్కు శివరామకృష్ణశర్మ, పాత పెందుర్తి శివాలయ అర్చకులు

శివుడు మోక్షకారకుడు. మహా శివరాత్రి పర్వదినాన ఉపవాసంతో జాగరణ చేసి లింగోద్భావ సమయంలో పంచాక్షరి మంత్రం పఠిస్తే మోక్షం సిద్ధిస్తుంది. విశ్వలోకానికి లయకారుడైన శివుడు సర్వాంతరయామి. శివ జాగరణతో ముక్కోటి దేవతలను పూజించినంత ఫలం దక్కుతుందన్నది ఆర్యోక్తి.

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం: మహా శివరాత్రిని పురస్కరించుకుని 87 వార్డు పరిధి కణితి ఉమామహేశ్వరాలయం, సంతమామిడితోటలో, 86వ వార్డు సాయిరాంనగర్‌లోని శివాలయం, మాతృశ్రీనగర్‌లో శ్రీకాశీ అన్నపూర్ణాదేవి సమేత శ్రీవిశ్వేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామాలు, ద్వాదశాభిషేకాలు నిర్వహించన్నారు. వందలాది మంది భక్తులు ఆయా ఆలయాలకు రానున్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ దీపాల వెలుగులో అక్కిరెడ్డిపాలెం శివాలయం

పెదగంట్యాడ: మండలంలోని పలు శివాలయాలను ఆలయ నిర్వాహక కమిటీలు అందంగా తీర్చిదిద్దాయి. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాలతో పాటు పరిసర ప్రాంతాలను అలంకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బారికేడ్లు, ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్దనున్న పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరాలయం, బాలచెరువు కాలనీలోని ఉమా రామలింగేశ్వరాలయం, నెల్లిముక్కులోని పార్వతీ సమేత పరమేశ్వరాలయం, దుర్గవానిపాలెంలోని సోమేశ్వరాలయం, ప్రియదర్శని కాలనీలోని ఉమారామలింగేశ్వరుని, గిరిజాకాలనీలోని ఉమామహేశ్వరాలయాల్లో శుక్రవా రం వేకువ జాము నుంచే త్రినేత్రునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, చేయనున్నారు.

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68, 69 వార్డులలోని పలు శివాలయాలను మహా శివరాత్రి సందర్భంగా సుందరంగా తీర్చిదిద్దారు. అక్కిరెడ్డిపాలెంలోని సాయి సహిత శివాలయం, షీలానగర్‌లోని విశ్వేశ్వరాలయం, నాతయ్యపాలెం, తుంగ్లాం, తదితర శివాలయాలు విద్యుత్ దీపాలతో విరాజిల్లుతున్నాయి. వేకువజాము నుంచే ఆయా ఆలయాల్లో పూజలు, అభిషేకాలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీల సభ్యులు తెలిపారు.

ఎన్.ఎ.డి. జంక్షన్: గ్రేటర్ 90వ వార్డు పరిధి ఎన్ఏడీ కూడలిలోని శివాలయం, సునర్లకాలనీలోని కాశీవిశ్వేశరాలయం, ఎఫ్.బ్లాక్‌లోని, కాకానీనగర్, దుర్గానగర్, తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో ఉదయం నుంచి రాత్రి లింగోద్భావ సమయం వరకు పూజలు, అభిషేకాలు చేయన్నారు. అలాగే వేపగుంట, నాయుడుతోట, ప్రహ్లాదపురం పరిసర ప్రాంతాల్లోని శివాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు రానున్నందున వారు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ యువ ఉద్యోగుల నిరసన

తక్షణమే వేతన సవరణ చేయాలంటూ పరిపాలన భవనం వద్ద ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 7: ఉక్కు కార్మికులకు తక్షణమే వేతన సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ యువ ఉద్యోగులు స్టీల్ ప్లేటు, స్పూన్‌లతో పెద్దగా శబ్దాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ మేరకు గురువారం ఉక్కు పరిపాలన భవనం ముందు యువ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో పూర్తి స్థాయిలో ఉత్పత్తిని చేపట్టాలని, ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని.. లేకుంటే సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. వేతన సవరణ చేయకపోవడం వల్ల యువ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించటంలో ఉక్కు యాజమాన్యం విఫలమైందన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటాలను ఆపేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కోరాడ వెంకటరావు, జెర్రిపోతుల మోహన్‌కుమార్, మహేశ్, మరిడయ్య, తదితరులు పాల్గొన్నారు.



స్టీల్ ప్లేటు, స్పూన్‌లతో శబ్దం చేస్తూ నిరసన తెలుపుతున్న ఉక్కు యువ ఉద్యోగులు

కార్మికులను భయాబ్రాంతులకు గురి చేయవద్దు

కార్మికులను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం భయభ్రాంతులకు గురి చేస్తుందని, ఇది మంచి పద్ధతి కాదని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. బయోమెట్రిక్ అమలును వ్యతిరేకిస్తూ గురువారం ప్లాంట్‌లో కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికులకు ప్లాంట్‌లో కనీస సౌకర్యాలు లేవని, ఆర్థిక ప్రయోజనాలను యాజమాన్యం కల్పించడం లేదన్నారు. వీటి గురించి పట్టించుకోకుండా ఇష్టానుసారంగా బయోమెట్రిక్ అమలు చేసేందుకు సిద్ధపడడం దారుణమన్నారు. చేయటానికి కాంట్రాక్టు కార్మికుల వివరాలు ఇవ్వకపోతే గేటు పాస్ ఆపేస్తామని బెదిరించడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు, డీవీ రమణారెడ్డి, జి.గణపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో ముగిసిన ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పో

ఆటోనగర్, మార్చి 7: ఆటోనగర్ ఎంఎస్‌ఎంఈ కార్యాలయ ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఎక్స్‌పో-2024 గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్ఎస్ రావు మాట్లాడుతూ చిన్నపరిశ్రమల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. పారిశ్రామికవేత్తలు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌బీఐ ఆర్ఎం సంజిత్‌కుమార్ దెబ్‌నాథ్ మాట్లాడుతూ బ్యాంకులు ఇస్తున్న రాయితీలను వివరించారు. ఎంఎస్‌ఎంఈ డీఎఫ్ఓ-అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి, అప్పికొండ శ్రీనివాసరావు, ప్రభాకరకుమార్‌ల సారథ్యంలో స్టాళ్లు ఏర్పాటు చేసిన పారిశ్రామికవేత్తలకు, వాసీవా సిబ్బందికి ముఖ్యఅతిథులు జ్ఞాపికలు అందజేశారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, లఘు ఉద్యోగ భారతి ప్రెసిడెంట్ ఏకే బాలాజీ, ఐలా కమిషనర్ కె.జయచంద్ర, చైర్మన్ సత్యనారాయణ రెడ్డి (రఘు), ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఎన్‌సీపీసీ మేనేజర్ కమలేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



వేదికపై గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్ఎస్ రావు, తదితరులు

పని ప్రదేశంలో నిబంధనలను పాటించాలి

ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహామ్ వర్గీస్



మాట్లాడుతున్న అబ్రహామ్ వర్గీస్

గోపాలపట్నం, మార్చి 7: కార్మికులందరూ తమ పని ప్రదేశంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించడం ద్వారా పూర్తి రక్షణ పొందవచ్చని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహామ్ వర్గీస్ అన్నారు. ఎన్ఎస్‌టీఎల్‌లో భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో చేపట్టాల్సిన ప్రాథమిక జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రయోగశాలల్లో చేపడుతున్న భద్రతా చర్యలను విశదీకరించారు. పలువురు వక్తలు భద్రతా నిబంధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఎన్ఎల్ జనరల్ మేనేజర్ డాక్టర్ రామ్‌ప్రసాద్, సీఏడీ విభాగం డిప్యూటీ డీఎస్పీ డి.లక్ష్మణరావు, కేటీపీ రుద్రప్ప, సైంటిస్టు డాక్టర్ రాధాకృష్ణ, ఎన్.రవికుమార్, ఏయూ ఇంజనీరింగ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వీరాంజనేయస్వామి పరస

వేపగుంట, మార్చి 7: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా మాదిరిగానే గురువారం కూడా వేపగుంటలోని వీరాంజనేయస్వామి పరసను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం పరస నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన

పెందుర్తి, మార్చి 7: బాల్య వివాహాల నియంత్రణపై సీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఎస్ఆర్‌పురం, వాలిమెరకల్లో గురువారం ప్రచార రథంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రచార రథంలో ఏర్పాటు చేసిన వీడియో పాఠాలు, సందేశాలను స్థానిక పాఠశాల విద్యార్థినులకు వివరించారు. బాల్య వివాహాల వల్ల చోటుచేసుకునే అనర్థాలను, బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. కలిగించారు. బాల్య వివాహ రహిత భారతదేశం ఆకాంక్ష సామాజిక బాధ్యత కావాలని నినదించారు. కార్యక్రమంలో బొడ్డు సూర్యప్రకాశ్, సామాజిక కార్యకర్త మీనాకుమారి సచివాలయ, 'సీడ్' సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

గాజువాక, మార్చి 7: స్థానిక చైతన్య మహిళా కళాశాలలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యురాలు బి.సూర్యప్రభ ముఖ్యఅతిథిగా హాజరై పలు అంశాలపై మాట్లాడారు. ప్రస్తుత కాలంలో మహిళా శక్తి విశేషమైనదని, మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. అనంతరం ఆమెను కళాశాల ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ చంద్రమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలని సెయింట్ ఆన్స్ సొసైటీ విశాఖపట్నం ప్రొవిన్షియల్ సుపీరియర్ సిస్టర్ శాండ్రినా అన్నారు. మల్కాపురంలో నవజ్యోతి మహిళా పరస్పర సహకార పరపతి సంఘం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలంతా చిరునవ్వుతో కష్టాలను ఎదుర్కొంటూ సమాజంలో కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ ఆస్పత్రి పాలనాధికారి సిస్టర్ బిన్సీ, జాతీయ సేవా పథకం పే జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, వై.అనసూయదేవి, వెంకటలక్ష్మి, విజయ, హేమలత, తులసీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే మల్కాపురం కళంజియా సమాఖ్య ఆధ్వర్యంలో, 59వ వార్డు నెహ్రూనగర్‌లోని కోరమాండల్ సామాజిక భవనంలో మహిళా దినోత్సవాన్ని జరిపారు.

పెదగంట్యాడ: ఇక్కడి సీడబ్ల్యూసీలో మహిళా దినోత్సవాన్ని పత్రీజీ పిరమిడ్ స్పిరుట్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, సంగీత విభావరి అందరినీ ఆకట్టుకున్నాయి. ట్రస్టు నిర్వాహక సభ్యుడు మీసాల శివగణేశ్వరరావు, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు రమణమ్మ, శారద, నందప్రసాదరావు, వనిత, పద్మావతి, భాగ్యగౌరి, బ్రహ్మకుమారి, తదితరులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

వీఎస్ఈజెడ్‌లో ఆకట్టుకున్న మాక్‌డ్రిల్

కూర్మన్నపాలెం, మార్చి 7: భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎన్ఎండీఏ, ఏపీఎస్‌డీఎంఏ సూచనల మేరకు దువ్వాడలోని వీఎస్ఈజెడ్‌లో గురువారం కెమిటెక్ ఆల్కోసైడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆఫ్ సైడ్ మాక్‌సైట్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించారు. కర్మాగారంలో కెమికల్ యాక్సిడెంట్ జరిగినప్పుడు క్షతగాత్రులను ఎలా ఆస్పత్రికి తరలించాలి, ప్రమాదాన్ని ఏ విధంగా అదుపులోకి తేవాలి, పరిసర ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలన్నది మాక్‌డ్రిల్ ద్వారా కళ్లకు కట్టినట్టు చూపించి అందరినీ అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో వీఎస్ఈజెడ్ ఏడీసీ ప్రసన్నకుమార్, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, కె.సుధాకర్, ఏపీపీసీబీ, ఏపీపీడీఆర్ఎఫ్, ఏపీ ఫైర్ సర్వీస్, పోలీస్, ఏఎంహెచ్‌ఓ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గాజువాక/కూర్మన్నపాలెం/అక్కిరెడ్డిపాలెం, మార్చి 7: జీవీఎంసీ 72వ వార్డులో పలు అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 86వ వార్డులో రూ.కోటీ 35 లక్షలతో రోడ్లు, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి మేయర్, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే 69వ వార్డులో సుమారు రూ.కోటీ 50 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను వారు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉరుకూటి చందు, కార్పొరేటర్లు ఏజే స్టాలిన్, కాకి గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు

40, 62వ వార్డుల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

సింధియా, మార్చి 7: జీవీఎంసీ 40, 62 వార్డుల్లో గురువారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా పోలీసులు మార్చ్ చేపట్టారు. ఆయా వార్డుల్లోని పలు పోలింగ్ బూత్‌ల పరిధిలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ చేపట్టి స్థానికంగా నెలకొన్న పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. మల్కాపురం సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

అగనంపూడి, మార్చి 7: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. వార్డు పరిధిలోని గల్లవానిపాలెం, షిర్డీసాయినగర్, పరిసర ప్రాంత కాలనీల్లో గురువారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ప్రస్తుతం రోడ్లపైకి వచ్చిన మురుగు, చెత్తకుప్పలను శుభ్రం చేయాలని పారిశుధ్య విభాగం సిబ్బందికి కార్పొరేటర్ సూచించారు.

దేవతా మూర్తులకు ప్రతి రూపమే మహిళలు

» క్రైమ్ డీసీపీ వెంకటరత్నం

డాబాగార్డెన్స్, మార్చి 7: ప్రతి స్త్రీ ఐదు దేవతా మూర్తుల శక్తిని కలిగి ఉంటుందని, దానిని వెలికితీసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని క్రైమ్ డీసీపీ వెంకటరత్నం పిలుపునిచ్చారు. గురువారం పాతజైల్‌రోడ్డులోని పైడా వుమెన్స్ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో స్త్రీ పాత్ర కీలకమన్నారు. ప్రేమ, ఆత్మస్థైరం, కుటుంబ నిర్వహణ, ఉన్నతి, అనుగారంలో పార్వతీదేవి, శక్తి, కాళీ, దుర్గ, సరస్వతీగా వ్యవహరిస్తుందన్నారు. విద్యార్థినులందరిలో ఆ శక్తులు దాగి ఉంటాయని, వాటిని వెలికి తీసి తమ ఉన్నతికి కృషి చేయాలన్నారు. పైడా కళాశాలల అధినేత పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 50 ఏళ్ల కిందట 80 మంది విదార్థులు చదువుకుంటే అందులో 78 మంది పురుషులు, కేవలం ఇద్దరు స్త్రీలు ఉండేవారన్నారు. అప్పట్లో మహిళలంతా ఇంటికే పరిమితమయ్యావారన్నారు. అంబేడ్కర్ లా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ స్త్రీ జన్మ ఎంతో గొప్పదన్నారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నతశిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.సరోజ్ అధ్యక్షత వహించగా, మిసెస్ ఆంధ్ర 2024 విజేత శిరీష, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్త్రీ గొప్పతనాన్ని వివరిస్తూ విద్యార్థినుల నృత్యాలు అలరించాయి.



డీసీపీ వెంకటరత్నం, లా ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, మిసెస్ ఆంధ్ర విజేత శిరీషను సత్కరిస్తున్న అతిథులు

మహిళా పోలీసులకు సత్కారం

మాధవధార: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మురళీనగర్ వనితా వాకర్స్‌క్లబ్‌లో గురువారం వేడుకలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన 50వవార్డు టీడీపీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు మహిళా దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విభిన్న రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలను సత్కరించారు. వీరిలో వన్‌టౌన్ మహిళా ఎస్.ఐ త్రినేత్రి, గోపాలపట్నం క్రైమ్ ఏఎస్ఐ గోవిందమ్మ, త్రీటౌన్ ఉమెన్ కానిస్టేబుల్ ఎస్.జలఉష, ద్వారకా ఏఎస్ఐ సీతామహాలక్ష్మి ఉన్నారు. వీరితో పాటు వ్యాపారం, కళల్లో ప్రతిభ చూపిన వారినీ సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు.



మహిళా పోలీసులను సత్కరిస్తున్న నిర్వాహకులు

మహిళా ఉద్యోగుల కృషి అభినందనీయం

విశాఖపట్నం: వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం రైల్వే క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్, మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ పాల్గొని రైల్వే శాఖ అభివృద్ధిలో మహిళా ఉద్యోగుల సేవలను కొనియాడారు. అనంతరం లోకో పైలెట్, ట్రైన్ మనేజర్, ట్రాక్ మెయింటెయినర్లతోపాటు లోకోషెడ్, సిగ్నల్ టెలికాం, హెల్త్ యూనిట్స్, ఆర్పీఎఫ్ శాఖలో పనిచేస్తున్న 45 మంది మహిళా ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం కార్యదర్శి మధుమితా సాహు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అంకిత శర్మ, తదితరులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న రైల్వే మహిళా సిబ్బందితో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఇతర అధికారులు

మహిళలకు చీరలు పంపిణీ

పూర్ణామార్కెట్: మహిళా దినోత్సవం సందర్భంగా వారి కళ్లలో సంతోషం చూసేందుకు దర్గాలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా చీరలు పంపిణీ చేసినట్టు బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ వెల్లడించారు. పూర్ణామార్కెట్, వెలంపేట, పెరికివీధి ప్రాంతాల్లో గురువారం మహిళలకు చీరలు పంపిణీ చేసి, మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఘన సత్కారం

సీతమ్మధార: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం పౌర గ్రంథాలయంలో పోలీస్ శాఖలో విశేష సేవలందించిన నగర క్రైం బ్రాంచ్ డిప్యూటీ కమిషనర్ పి.వెంకటరత్నంను యాక్మీ ఈవెంట్స్, నవరత్నాలు సంస్థ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఆమెతో పాటు వివిధ రంగాల్లో సేవలందించిన వారిని సత్కరించారు. ఎస్.రహమతుల్లా, రతన్ రాజు, శిజు భవకదన్, కొణతాల రాజు, ఆడారి కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలు విద్యలో రాణించాలి

సీతంపేట: మహిళలు విద్యలో రాణించాలని, జీఎస్టీ అధికారిణి డాక్టర్ జీన్ జేసుదాస్ పేర్కొన్నారు. పౌర గ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ బాలికలు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సీనియర్ స్టేజ్ నటి దూసి అనురాధను సత్కరించారు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బి.చిన్నారావు, ఉషారాణి, ఆచార్య ఎస్‌పీడీ పాల్, వర్రే నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు 4

... 5వ పేజీ తరువాయి

బదులుగా మాడుగుల కేటాయించాలని సూచించారు. దీనిపై ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. పెందుర్తి ఒకవేళ జనసేనకు ఇస్తే ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు పోటీ చేసే అవకాశం ఉంది. పంచకర్ల వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరినప్పుడు పెందుర్తి నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని అధినేతను కోరగా..ఆయన భరోసా ఇచ్చారని, దీంతో పొత్తుల్లో పెందుర్తి సీటును కోరారని పార్టీ నాయకులు చెబుతున్నారు.

'దక్షిణం'లో ఆశావహులు అనేకం

విశాఖ జిల్లాకు వచ్చేసరికి ఏడు అసెంబ్లీ స్థానాలు (ఆరు పూర్తిగా, ఒకటి పాక్షికంగా) ఉండగా...మొదట మూడు (గాజువాక, భీమిలి, విశాఖ దక్షిణం) సీట్లు ఇవ్వాలని జనసేన ప్రతిపాదించింది. అయితే అందుకు టీడీపీ అధిష్ఠానం ఒప్పుకోలేదు. దక్షిణ నియోజకవర్గం సీటు ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ సీటు కోసం జనసేనలో అనేక మంది పోటీ పడుతున్నారు. అయితే వైసీపీ ఎమ్మెల్సీగా ఉంటూ ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్‌కు అవకాశం లభించవచ్చునని ప్రచారం జరుగుతోంది. గత కొంతకాలంగా దక్షిణంలో టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీకి వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఇస్తారని అంచనా వేస్తున్నారు.

అమర్‌కు టికెట్ లేనట్టే?

... 5వ పేజీ తరువాయి

రత్నాకర్‌లు కొద్దికాలం క్రితం వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. జగన్ 'గుండెల్లో పెట్టుకుంటాను' అంటే దాని అర్థం ఇలాగే ఉంటుందని ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు అంటున్నారు. వాస్తవానికి అమర్‌నాథ్ మంత్రి అయిన తొలిరోజుల్లో మీడియా ముందు చేసిన 'కోడిగుడ్డు' వ్యాఖ్యలతో పార్టీకి చెడ్డపేరు వచ్చింది. కేవలం జనసేన అధినేతను దూషించడమే పనిగా పెట్టుకోవడంతో సొంత సామాజికవర్గం కూడా ఆయనకు కలిసి రాలేదు. ఈ నేపథ్యంలోనే ఆయన్ను ఈసారికి పక్కన పెట్టేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సైనికుడిలా పనిచేస్తా: మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ఇదే సభలో పాల్గొన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో తనకు పోటీ చేసే అవకాశం లేకపోయినా సరే సైనికుడిలా జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి పనిచేస్తానని ప్రకటించారు.

ఆస్తి పన్ను బకాయిలపై గ్రేటర్ దృష్టి

... 5వ పేజీ తరువాయి

రియల్టర్స్ ప్రైవేటు లిమిటెడ్ రూ.1,15,40,104, ఈస్ట్‌కోస్ట్ గ్యాస్ కంపెనీ రూ.89,98,582, వైజాగ్ ఐటీ పార్క్ లిమిటెడ్ రూ.89,47,196, మహతి సాఫ్ట్‌వేర్ ప్రైవేటు లిమిటెడ్ రూ.89,32,979 చెల్లించాల్సి ఉంది. వీటితో మిగిలిన అసెస్‌మెంట్ల యజమానుల నుంచి బకాయిలు రాబట్టేందుకు రెవెన్యూ అధికారులు పలువిధాలుగా యత్నిస్తున్నారు. అయితే కోర్టులో కేసులు వేయడం అడ్డంకిగా మారింది. అయినప్పటికీ ఇంతవరకూ రూ.18 కోట్లు వరకూ వసూలు చేయగలిగారు. మిగిలినవి వసూలకు న్యాయపరంగా చేపట్టాల్సిన ప్రక్రియను పూర్తిచేస్తూనే... యజమానులను కలిసి వివాద పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు.

తూనికలు, కొలతల శాఖ దాడులు



వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అక్కయ్యపాలెం, మార్చి 7: విశాఖపట్నం హోల్‌సేల్ కూరగాయలు, ఫ్రూట్స్ మార్కెట్లలో తూనికలు, కొలతల శాఖాధికారులు గురువారం దాడులు నిర్వహించారు. వ్యాపారులు వినియోగిస్తున్న కాటాలకు ముద్రలు లేకపోవడంతో మొత్తం 14 కేసులు నమోదు చేశారు. మార్కెట్‌లో తూనికలు, కొలతలపై ధర్మ కాటా ఏర్పాటు చేసి వినియోగదారులకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ కంట్రోలర్ కేటీ రవికుమార్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అసిస్టెంట్ కంట్రోలర్ పీడీవీ అప్పలరాజు, గాజువాక అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్ఎం రాధాకృష్ణ, సిటీ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పీసీబీ ఈఈగా ముకుందరావు



విశాఖపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీరు(ఈఈ)గా వీవీ. ముకుందరావును నియమించారు. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ఏఈఈగా పనిచేస్తున్న ఆయనకు తాజాగా పదోన్నతి లభించింది. కాలుష్య నియంత్రణ మండలిలో 2007లో ఏఈఈగా నియమితులయ్యారు. ఇప్పటివరకు విశాఖలో ఈఈగా పనిచేసిన నాగిరెడ్డి పదోన్నతిపై జోనల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఎస్ఈ పోస్టులో నియమితులయ్యారు.

ఘనంగా నీలమ్మ అమ్మవారి తొలేళ్లు

అల్లిపురం, మార్చి 7: స్థానిక శ్రీనీలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం తొలేళ్ల ఉత్సవంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, ఉదకాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. అనంతరం తిరువీధుల్లో మహిళా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించి తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో భక్తులు అగ్నిగుండం మహోత్సవం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, ఆలయ ఈవో రమాబాయి. బొర్రాశ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



నీలమ్మ అమ్మవారికి పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు

నేటి నుంచి శివ జయంతి ఉత్సవాలు

డాబాగార్డెన్స్: నవనిర్మాణం చేసే శక్తి ఆధ్యాత్మికతకు మాత్రమే ఉందని వక్తలు పేర్కొన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో 88వ త్రిమూర్తి శివ జయంతి వివరాలను బ్రహ్మకుమారీస్ ప్రతినిధి టీకే కామేశ్వరి తెలిపారు. ఈ నెల 8,9,10 తేదీల్లో ఎండాడలో సహస్ర శివలింగ దర్శనం, అభిషేక లింగం, పుష్పలింగం, మంచులింగ దర్శనం ఉంటుందన్నారు. శారదాపీఠాధిపతి ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ జాయింట్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు బ్యానర్‌ను ఆవిష్కరించారు.

శివపూజలకు సర్వం సిద్ధం

కంచరపాలెం: శివరాత్రి పర్వదినం సందర్భంగా కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో శైవాలయాలు ముస్తాబయ్యాయి. తిక్కవానిపాలెం, రెడ్డికంచరపాలెం, గంగన్ననగర్, గొల్లకంచరపాలెం, మెట్టు, తుమ్మడిపాలెం తదితర ఆలయాలను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయాల్లో శుక్రవారం తెల్లవారుజామునుంచి జరగనున్న ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

శివరాత్రి వేడుకలకు ఆహ్వానం

మురళీనగర్: స్థానిక బ్రహ్మకుమారీస్ శాంతి ధామంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్టు నిర్వాహకురాలు టీకే అపరంజి తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి కాశీ విశ్వనాథుని దర్శనం, స్వయంగా అభిషేకం చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా శివ అవతరణ తెలిపే చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మాధవధార, మురళీనగర్ ఆలయాల్లో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

గణపతి ఆలయంలో అన్నదానం

జ్ఞానాపురం: కాన్వెంట్ కూడలి జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్ వద్ద గల శ్రీసౌభాగ్య గణపతి ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మోపిదేవి శంకరరావు, రామకృష్ణ ఆర్థిక సహాయంతో సమారు 3వేల మందికి అన్నదానం చేశారు. అంతకు ముందు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలకంరణలు చేశారు. కార్యక్రమంలో హోల్‌సేల్ మార్కెట్ సభ్యులు కె.వీర్రాజు, విల్లూరి పరమేశ్, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'వెలమల రాజకీయ హక్కుల పరిరక్షణే ధ్యేయం'

డాబాగార్డెన్స్, మార్చి 7: వెలమల రాజకీయ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పరిరక్షణ వేదిక కృషి చేస్తుందని కన్వీనర్ రెడ్డి దామోదరరావు అన్నారు. గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గానికి ఐదు పార్లమెంట్, 24 అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 35 లక్షల వెలమలున్నారని, టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులను కలిసి వినతి పత్రాలు ఇచ్చామన్నారు.



సంఘీభావం ప్రకటిస్తున్న వెలమ సంక్షేమ సంఘం సభ్యులు

తగిన ప్రాధాన్యమివ్వాలి

సిరిపురం : వచ్చే ఎన్నికల్లో వెలమలకు తగిన ప్రాధాన్యమివ్వాలని వెలమ రాజకీయ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రెడ్డి దామోదరరావు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో వెలమ కులస్థుల హక్కులపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తగిన ప్రాధాన్యత ఇవ్వని పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు. సమావేశంలో సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్కా చినబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, చలుమూరు అప్పల సత్యనారాయణ, రొంగలి జగన్నాథం, ముర్రి ముత్యాలనాయుడు, ఈర్ల శ్రీరామ్మూర్తి, సిరిపురపు కృష్ణమోహన్, పైలా ముత్యాలనాయుడు, బండారు రామకృష్ణ, రాజాన వెంకటరావు, గొర్లు వెంకునాయుడు, పైలా మారయ్య, జాగారపు బుచ్చు, రంభ నారాయణమూర్తి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరం

» టెక్నికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర సెక్రటరీ రమణబాబు

కంచరపాలెం, మార్చి 7: పరిశ్రమల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరమని రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ కె.వి.రమణబాబు పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన 'పరిశ్రమలు-భద్రత'పై అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు భద్రతా నియమాలు పాటించాన్నారు. విధులు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ జీఎం (సేఫ్టీ) దువ్వాడ రామ్‌ప్రసాద్ భద్రతపై పలు అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన సదస్సులో సేఫ్టీ కోర్సుల కో ఆర్డినేటర్ ఎ.వరహాలు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమణబాబు

సచివాలయంలో ప్రజా ప్రతినిధుల చిందులు

» జత కలిసిన ఉద్యోగులు, వలంటీర్లు
» సినిమా పాటలకు డ్యాన్సులు చేస్తూ హడావిడి
» సామాజిక మాధ్యమాల్లో వైరల్
» ధారకొండలో ఘటన
» మండిపడుతున్న గ్రామస్థులు

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా), మార్చి 7: పౌర సేవలు అందించాల్సిన సచివాలయంలో ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, వలంటీర్లు చిందులు వేశారు. సినిమా పాటలకు డ్యాన్సులు చేస్తూ హడావిడి చేశారు. దీనిని వీడియో తీసి వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోవడంతో గురువారం ఇది సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీది మండలం ధారకొండలో కొత్తగా నిర్మించిన సచివాలయం భవనాన్ని బుధవారం ఉదయం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అట్టహాసంగా ప్రారంభించారు.



ధారకొండ సచివాలయంలో డ్యాన్సులు చేస్తున్న ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు

కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే వెళ్లిపోయిన తరువాత వైసీపీకి చెందిన గ్రామ సర్పంచ్ నడిగట్ల రాజు, ఆయన అనుచరులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సచివాలయంలోకి వెళ్లి సినిమా పాటలు పెట్టుకుని డ్యాన్సులు చేశారు. ఆ సమయంలో బయట వారిని ఎవరినీ లోపలకు అనుమతించలేదు. వీరిలో ఒకరు ఈ డ్యాన్సులను వీడియో తీసి గురువారం వాట్సాప్ స్టేటస్ పెట్టడంతో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. సచివాలయంలో ఇటువంటి చేష్టలు ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై కలెక్టర్, ఐటీడీఏ పీవోకు స్థానికులు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

నేడు పశుపతినాథేశ్వరస్వామి ఆలయంలో పూజలు

ఎండాడ, మార్చి 7 : ఎండాడలో ఉన్న కోదండ రామాలయం, వినాయక, సాయిబాబా, పశుపతినాథేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు మాదు రాజు తెలిపారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. వేకువజాము నుంచి స్వామివారికి పూజలు, అభిషేకాలు జరుగుతాయని, సాయంత్రం 4 నుంచి రుద్రాభిషేకం, 6 గంటలకు స్వామివారి కల్యాణం జరగనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

ఆరిలోవ : మహా శివరాత్రి పురస్కరించుకుని ఆరిలోవలోని పలు దేవాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల వద్ద ఏర్పాట్లు చేశారు. పెదగదిలిలోని కాశీ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి ఆలయం, శివాజీనగర్‌లోని జ్యోతి లింగేశ్వరస్వామి ఆలయం, డ్రైవర్స్ కాలనీ, ఆరిలోవ ఆసుపత్రి సమీపంలో ఉన్న బాలత్రిపురసుందరి సహిత మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వేకువజాము నుంచి పూజలు, అభిషేకాలు చేయనున్నారు.

భీమునిపట్నం : పట్టణంలోని శివాలయాలను శివరాత్రి వేడుకలకు ముస్తాబు చేశారు. పలు ఆలయాల్లో శుక్రవారం రాత్రి 8.35 నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము 5.05 వరకూ అభిషేకాలు, పూజలు చేయనున్నారు. గొల్లవీధిలోని శ్రీకృష్ణ గుడి జంక్షన్‌లో సాయంత్రం నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము వరకూ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసామని నాయకుడు గొలగాని నరేంద్రకుమార్ తెలిపారు. అలాగే బ్రహ్మగిరిపై బ్రహ్మగారి ఆలయంలోనూ వేడుకలు జరగనున్నాయి.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అందరి బాధ్యత

ఆనందపురం, మార్చి 7 : విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ అందరి బాధ్యత అని జీవీఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాడి మనోహర్ కుమార్ అన్నారు. గురువారం ఆయన విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు రుద్రరాజు, ఇతర సీనియర్ నాయకులను కలిసారు. ఈ సందర్భంగా ఈనెల 11న స్టీల్‌ప్లాంట్ వద్ద జరిగే బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చించారు. సభకు పీసీసీ చీఫ్ షర్మిల, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరుకానుండడంతో ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మనోహర్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

మన్యం బంద్‌కు గిరిజన ఉద్యోగుల సంఘం మద్దతు

ఎంవీపీ కాలనీ, మార్చి 7 : అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈనెల 10న జరిగే మన్యం బంద్‌కు తమ మద్దతు ప్రకటిస్తున్నామని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, ప్రభాకర్ మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఏజెన్సీలో అనేక ఉద్యోగాలు ఇస్తున్నా, స్థానిక గిరిజనులకు కేటాయించడం లేదని పేర్కొన్నారు. ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని, జీవో నెంబరు 3, టీఏసీ తీర్మానం ఆమోదించినట్టు ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే 1500 నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా ప్రకటించాలన్నారు.

పాఠశాలకు స్టేషనరీ సామగ్రి వితరణ

పెదవాల్తేరు, మార్చి 7 : చినవాల్తేరు చేపల మార్కెట్ సమీపంలో ఉన్న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల -2లో చదువుతున్న విద్యార్థులకు సంఘ సేవకుడు షేక్ అజీమ్ ఆలీ తన సొంత నిధులతో స్టేషనరీ సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్

పద్మనాభం, మార్చి 7 : ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా గ్రామాల్లో పారా మిలటరీ దళాలతో గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. రేవిడి, రౌతులపాలెం, పొట్నూరు, రెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్నికల్లో సమస్యాత్మకంగా ఉన్న గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి మధురవాడ జోన్ ఏసీపీ సునీల్ ఆధ్వర్యంలో సీఐ శ్రీధర్ ఈ కవాతు నిర్వహించారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 16, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజ్ 22, క్యారెట్ 24, దొండకాయలు 24, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 55, అల్లం (పాతది) 110, బరబటి 15, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 28, కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



23వ వార్డులో పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి



ఎంవీపీ కాలనీలో ప్రచారం చేస్తున్న పట్టాభిరామ్, తదితరులు

సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వరం

ఎమ్మెల్యే వెలగపూడి

మద్దిలపాలెం, మార్చి 7 : చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు వరాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. 23వ వార్డు మద్దిలపాలెంలో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీని గెలిపిస్తే కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అరాచక పాలనను తరిమికొట్టాలన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు గొలగాని పురుషోత్తం, నాయకులు రాంబాబు, పోతన్నరెడ్డి, గుడ్ల గోవిందరెడ్డి, కాకి వేణుబాయ్, చల్ల నూకరాజు, తెంటు స్వామి, నాయుడు, నిద్రబంగి కుమార్, పూతి వరప్రసాద్, కనకరాజు, నాగమణి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

తూర్పులో టీడీపీ ప్రచారం ప్రారంభం

ఎంవీపీ కాలనీ : తూర్పు నియోజకవర్గంలో ఎన్నికల వేడి మొదలయ్యింది. వైసీపీ ఇప్పటికే భారీస్థాయిలో ప్రచారం మొదలుపెట్టగా టీడీపీ తరపున ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరామ్ గురువారం సాయంత్రం ప్రచారం ప్రారంభించారు. ఎంవీపీ కాలనీ, పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేస్తూ ఎంపీగా శ్రీభరత్, ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబును గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, పూసపాటి రాజు, గొలగాని రాము, రవికిరణ్, కళావతి, నరేంద్ర, వాసు, దేముడుబాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, మార్చి 7 : అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన గురువారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని పరిమళభరిత పుష్పమాలతో, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు బయటకు తీసి భక్తులతో స్పృసింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించిన అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున బంగరు సంపెంగలతో అర్చనలు చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహించారు.

ఆకట్టుకున్న దివ్యాంగుల వైజ్ఞానిక ప్రదర్శన

పెదవాల్తేరు, మార్చి 7 : పెదవాల్తేరులోని సన్ ఫ్లవర్ ప్రత్యేక పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను షిప్ యార్డ్ రిటైర్డ్ డిప్యూడీ జనరల్ మేనేజర్ సాయి ప్రసాద్ గురువారం ప్రారంభించారు. వంద మంది దివ్యాంగ విద్యార్థులు ఈ నమూనాలను ఏర్పాటు చేశారు. కాలుష్య నివారణ, నీటి సంరక్షణ, చారిత్రక కట్టడాలు, గృహ ఉపకరణ వస్తువులు, తదితర వాటిని తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ కుమారి, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

మురా కార్మికుల ర్యాలీ

తగరపువలస, మార్చి 7 : తగరపువలస పరిసర ప్రాంతాల్లో వివిధ దుకాణాల్లో పనిచేస్తున్న మురా కార్మికులు కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకొకసారి పెంచాల్సిన మురా కార్మికుల కూలిరేట్లను పెంచడం లేదని చెప్పారు. నిత్యావసర సరకుల ధరలు, విద్య, వైద్యం ఖరీదు పెరిగిపోయిన నేపథ్యంలో కూలి రేట్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మురా కార్మిక సంఘం ప్రతినిధులు నరసింగరావు, ముగడ ఈశ్వరరావు, చిల్ల రాము, ఆదినారాయణ, సింహాచలం పాల్గొన్నారు.

అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్‌గా ధనుంజయరావు

వెంకోజీపాలెం, మార్చి 7 : ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్‌గా ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ నుంచి ఆయన ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం తన కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

పరిశోధకురాలికి పురస్కారం

ఏయూ హిందీ విభాగం పరిశోధకురాలు డాక్టర్ వి.సరోజినికి కబీర్ కోహినూర్ సమ్మాన్ 2024 పురస్కారం లభించింది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు సద్గురు ఆశ్రమం ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో సరోజినిని అభినందించారు. అలాగే హిందీ విభాగంలో జేఆర్ఎఫ్ సాధించిన షేక్ మనల్లా హుస్సేన్‌ను కూడా వీసీ అభినందించారు.

స్టేడియం సిబ్బందికి వైద్య పరీక్షలు

మధురవాడ, మార్చి 7 : పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏవీడీసీఏ క్రికెట్ స్టేడియం సిబ్బందికి అపోలో ఆస్పత్రి వైద్యులు గురువారం ఉచిత పరీక్షలు నిర్వహించారు. స్టేడియంలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారికి షుగర్, బీపీ, ఈసీజీతో పాటు రక్తపూత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ సీఈఓ శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

భీమునిపట్నం, మార్చి 7 : భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి గురువారం బీచ్‌రోడ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఉత్సవాలు ఏప్రిల్ 7 నుంచి 10 వరకు జరనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గిడుతూరి డెక్కన్ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పీరుపల్లి రాజు, కోశాధికారి నరసింగరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగిరెడ్డి వెంకటస్వామి, అప్పికొండ బాలకృష్ణ పాల్గొన్నారు.

'ఇళ్ల మరమ్మతుకు అనుమతి ఇవ్వాలి'

సింహాచలం, మార్చి 7 : కొండవాలు ప్రాంతం సర్వే నంబరు 275లోని సత్యసాయినగర్ ప్రాంతానికి చెందిన కొందరు నిరుపేదలు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును, సింహాచల దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తిని కలిసి ఇళ్ల మరమ్మతుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈమేరకు సింహగిరిపై వారు ఎమ్మెల్యేను, ఈఓను కలిసారు.

కిరణ్మయిరెడ్డికి మహిళా శాస్త్రవేత్త అవార్డు

సాగర్‌నగర్, మార్చి 7 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పర్యావరణశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్మయిరెడ్డి పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయ రంగం, ఆవరణ వ్యవస్థలపై నిర్వహించిన పరిశోధనలకు గాను సొసైటీ ఫర్ సస్టైనబుల్ అండ్ కన్సర్వేషన్ ఇకాలజీ ఉత్తమ మహిళా శాస్త్రవేత్త అవార్డు అందించింది. ఇటీవల న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చిలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో నిర్వాహకులు ఆమెకు ఈ అవార్డును ఇచ్చారు. వ్యవసాయ, పర్యావరణ సంబంధిత పరిశోధనల్లో 17 ఏళ్ల సుదీర్ఘ అనుభవం గల కిరణ్మయిరెడ్డి 26 పరిశోధన పత్రాలను ప్రచురించారు.

జర్నలిస్టులపై దాడులు సరికాదు : వీసీ

వెంకోజీపాలెం, మార్చి 7 : రాజకీయ పక్షాలు జర్నలిస్టులపై దాడులు చేయడం సరికాదని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. జర్నలిస్టులు కూడా దాడులు జరిగేందుకు అవకాశం ఇవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగు జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం ఏయూలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రస్తుత మీడియా స్థితిగతుల్ని అధ్యయనం చేసి ఆ రంగం సజావుగా నిలబడేందుకు తగిన తోడ్పాటు ఇచ్చేందుకు మీడియా కమిషన్‌ను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. వెంకటరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు, గంట్ల శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు. కాగా ఈనెల 11న అన్ని జిల్లా కేంద్రాల్లోనూ కలెక్టర్లను కలిసి వినతి పత్రాలు అందజేయాలని రాష్ట్ర కార్యవర్గం పిలుపునిచ్చింది.

మహా యజ్ఞం సమాచార కేంద్రం

సింహాచలం, మార్చి 7 : సింహగిరిపై ఈనెల 26 నుంచి జరిగే నారసింహ మహాయజ్ఞం సమాచార కేంద్రాన్ని కొండ దిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజల తరువాత దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి గురువారం కేంద్రాన్ని ప్రారంభించి, తొలి టికెట్‌ను భక్తునికి అందజేశారు. యజ్ఞంలో పాల్గొనే వారు రూ. 3 వేలు చెల్లించి సింహగిరిపై పీఆర్ఓ కార్యాలయం లేదా కొండదిగువ శ్రీదేవి కాంప్లెక్స్‌లోని సమాచార కేంద్రంలోనూ టికెట్లు పొందాలని ఈఓ సూచించారు.

ఎన్నికల్లో సెక్టార్ అధికారులదే కీలక పాత్ర

భీమునిపట్నం, మార్చి 7 : ఎన్నికల్లో సెక్టార్ అధికారులదే ప్రధాన పాత్ర అని తహసీల్దార్ గోవింద్ అన్నారు.గురువారం ఆయన తన కార్యాలయంలో ఆర్డీవో భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో శాంతి భద్రతల పరిస్థితులు ఏవిధంగా వున్నాయన్నది అనుక్షణం పరిశీలనలో వుంచుకోవాలన్నారు. గ్రామాల్లోని పరిస్థితులు, రాజకీయ వర్గాల పరిస్థితులు, లా అండ్ ఆర్డర్ గురించి ఎప్పటికపుడు సమాచారాన్ని సేకరించి తెలియజేయాలని సూచించారు.

వెయ్యి మందికి వైద్య పరీక్షలు

ఆరిలోవ, మార్చి 7 : చినగదిలిలోని నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం కూడలి వద్ద గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ సేవా సమితి, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో గీతం వైద్యులు వెయ్యి మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, కార్యదర్శి భరత్, నాయకులు ఒమ్మి పోలారావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడుమూరి గోవింద్, ముగడ రాజారావు, మద్దిల రాజేష్, నాంబార గోపి, జనసేన నాయకులు ధూళి రఘు, దువ్వి తాతారావు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు

ఆరిలోవ, మార్చి 7 : హనుమంతువాక జంక్షన్ నుంచి దీనదయాళపురం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన పలు దుకాణాలను ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వారాక సీఐ ప్రసాద్‌ఆదేశాల మేరకు దుకాణాలను తొలగించినట్టు తెలిపారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు

సింహాచలం, మార్చి 7 : జీవీఎంసీ 98వ వార్డులో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, వాటిని నిర్వహించిన అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘించారని కార్పొరేటర్ నరసింహం ఆరోపించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. గురువారం వార్డు పరిధిలో జరిగిన శంకుస్థాపనలు, కొద్దిరోజుల క్రితం వాసుదేవ కల్యాణ మండపంలో జరిగిన బీఆర్‌టీఎస్ పనుల శంకుస్థాపనకు తనను ఆహ్వానించలేదని చెప్పారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచాలి

సింహాచలం, మార్చి 7 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో కాంట్రాక్టర్ పద్ధతిలో పనిచేస్తున్న తమకు అరకొర జీతాల వల్ల జీవనం దుర్భరంగా ఉందని పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు, ఈఓ శ్రీనివాసమూర్తిని కలిసి తమ కష్టాలను విన్నవించారు. చేతికి రూ. 7 వేలు మాత్రమే వస్తోందని, దాంతో ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జీతాలు పెంచాలని కోరారు.


















మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

మద్దిలపాలెం, మార్చి 7 : మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించి, ప్రపంచానికి తమ శక్తిని చాటి చెప్పాలని ఆదాయపు పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి. అపర్ణ అన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. మహిళలకు మానసిక దృఢత్వం ఎంతో అవసరమని, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే అద్భుతాలు సాధించగలగుతారని చెప్పారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ రాణించి కుటుంబానికి, సమాజానికి గర్వంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐ. విజయబాబు, కుసుమ కుమారి, వైస్ ప్రిన్సిపాల్ పి. జయ, రూపవాణి పాల్గొన్నారు.

తగరపువలస : తగరపువలసలోని జీవీఎంసీ పాఠశాలలో ఉపాధ్యాయినులను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సన్మానించారు. ఒకటో వార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్. అప్పలరాజు, మల్లిక, కె. కృష్ణవేణి పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : మహిళా విద్యకు ఏయూ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వీసీ ప్రసాదరెడ్డి అన్నారు.ఏయూ కన్వెక్షన్ సెంటర్‌లో దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వర్సిటీలో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా ఆరేళ్లలో ఆరు వసతి గృహాలను నిర్మించామన్నారు. అంతకముందు పలువురు దుర్గాభాయి దేశ్‌ముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ/సింహాచలం : అర్హులైన వారు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 5వ వార్డు బోరవానిపాలెం అంబేడ్కర్ కాలనీలో గురువారం ఆయన నాలుగు వేల మందికి ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు అందించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పోతిన హనుమంతరావు, మన్యాల సోంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే సింహాచలంలోని ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే 900 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అంతకుముందు గోశాల లేఅవుట్‌లో జీవీఎంసీ నిధులు రూ. 20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు వైసీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, అడివివరం సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైసీపీ ఇన్‌చార్జి ఎర్ర వరంబాబు పాల్గొన్నారు.

భీమునిపట్నం : చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే వాలంటీర్లను తొలగిస్తారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి అన్నారు. ఆయన బీచ్ రోడ్డులో లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ చెప్పాడంటే తప్పకుండా చేస్తాడన్నారు. ఇళ్లు, చేయూత తదితర సంక్షేమ పథకాలన్నీ అందాలంటే వైసీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ కనకమహాలక్ష్మి, కార్పొరేటర్లు అప్పలకొండ, ఏడుకొండలరావు, నాయకులు నర్సింగరావు, రాముినాయుడు, కరుణాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, మధునాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.